సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



మురుగుతో అవస్థలు
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో దశాబ్దాలుగా మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగాతయారైంది. - 9లో



ఆకట్టుకుంటున్న ఫైబర్ సెట్టింగ్
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఫైబర్ సెట్టింగ్ ఆకట్టుకుంటుంది. - 10లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 39°/25°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నెలలు కాలవ్యవధి కల్గిన సీ లాంగ్వేజ్‌కు డిగ్రీ ఉత్తీర్ణత, 2 నెలల కాలవ్యవధి గల గ్రాఫిక్ డిజైనింగ్ ఇంటర్, అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు ఇంటర్ (సీఈసీ) విద్యార్హత ఉండాలన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గినవారు ఈ నెల 24న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు విద్యార్హతల సర్టిఫికెట్‌లు, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో నేరుగా హాజరు కావాలని కోరారు. కోర్సు మెటీరియల్ కోసం రూ.350 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.2 వేల ఫీజుతో హాస్టల్ వసతి ఉందని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం సెల్ నంబర్లు 9133908000, 9133908111ను సంప్రదించాలని సూచించారు.

రాజ్యాంగం.. ప్రజలకు రక్ష



మాట్లాడుతున్న మోతె పిచ్చిరెడ్డి

ఆత్మకూరు(ఎం): రాజ్యాంగం దేశ ప్రజలకు రక్షణ అని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి అన్నారు. ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్లలో జనసైన్యం యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా ఆ మహనీయుని 125 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని సెక్రటేరియట్‌పై సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. విద్యను హక్కుగా పొందుపరిచి దేశానికి వెలుగులు అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.కార్యక్రమంలో సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, వైస్ ఎంపీపీ బాషబోయిన పద్మ, ఉప సర్పంచ్ కొమ్ము నరేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాంబోజు భాను, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్కల స్వామి, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి భిక్షం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్ పాల్గొన్నారు.


యాదాద్రీశుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకారమండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ చేపట్టారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఘనంగా గాయత్రి హవనం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : పట్టణంలోని అఖండనామ ఆశ్రమంలో అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహా యజ్ఞం కొనసాగుతోంది. శనివారం కుజ దోషం, కాలసర్ప దోష నివారణ, వివాహ సిద్ధిని కోరుతూ కుజ గాయత్రి హవనం చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆశ్రమంలో వివిధ పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో కుజ గాయత్రి హవనం చేపట్టారు.

తిరంగా చికెన్.. ఖుబానీకా మీఠా..

రంజాన్ ఘుమఘుమలు

- ఆహార ప్రియులను ఆకర్షిస్తున్న వంటకాలు
- రంజాన్ మాసంలో ప్రత్యేకంగా వెలిసిన హోటళ్లు
- ప్రత్యేక రుచులను పరిచయం చేసిన హైదరాబాద్ క్యాటరర్స్
- ఆస్వాదిస్తున్న అన్ని వర్గాల ప్రజలు



తిరంగా చికెన్



వివిధ రకాల స్వీట్లు



చికెన్ స్టిక్స్

రంజాన్ మాసమంటే.. ఉపవాస దీక్షలతో పాటు నోరూరించే వంటకాలు కూడా ఉంటాయి. ఈ మాసంలో మాత్రమే వండే వంటకాల్లో హరీస్, హలీమ్, స్వీట్లు ప్రత్యేకం. ముస్లింల సంప్రదాయ వంటకాలు కాలక్రమేణా ప్రజలందరికీ చేరువయ్యాయి. గతంలో హైదరాబాద్ నగరానికే పరిమితమైన ఈ వంటకాల హోటళ్లు ప్రస్తుత రంజాన్ మాసంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చిన్న పట్టణాల్లో సైతం వెలిశాయి. ఈ రుచులను ఆస్వాదించేందుకు అన్ని మతాల ప్రజలు ఇష్టపడుతున్నారు.

సండే స్పెషల్

రామగిరి(నల్లగొండ), భానుపురి (సూర్యాపేట) : రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాసం ఉంటారు. పగటిపూట ఎలాంటి ఆహారం, నీరు సైతం తీసుకోరు. ఉదయం తెల్లవారు జామున (సహర్), సూర్యాస్తమయం తర్వాత (ఇఫ్తార్) రెండు పూటలు మాత్రమే ఆహారం తీసుకుంటారు. ఈ మాసంలో వారు తీసుకునే ఆహారం తప్పనిసరిగా బలవర్థకమైనదై ఉండాలి. తద్వారా ఉపవాస సమయంలో దేహానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆ ప్రాంత భౌగోళిక, సంస్కృతుల ఆధారంగా ఆహార పదార్థాలు ఉంటాయి. అందుకు తగిన విధంగా ఆహారం తీసుకుంటారు. ఈ మాసంలో ప్రత్యేకంగా హలీం, హరీస్ సెంటర్లు వెలుస్తాయి. ఈసారి మాత్రం హైదరాబాద్ ప్రాంత వంటకాలు సైతం జిల్లా వాసులకు అందుబాటులోకి వచ్చాయి.

నోరూరించేలా హైదరాబాద్ రుచులు

హైదరాబాద్ క్యాటరర్స్ ఆధ్వర్యంలో నల్లగొండలో ఐదు సంవత్సరాలుగా ప్రతి రంజాన్ మాసంలో నెల రోజుల పాటు హోటల్ నడుపుతున్నారు. ఈఏడాది సూర్యాపేటలోనూ హైదరాబాద్ క్యాటరర్స్ బ్రాంచీని ఏర్పాటు చేశారు. ఈ హోటళ్లలో రంజాన్ ప్రత్యేక వంటకాలైన చికెన్ హరీస్, మటన్ హలీమ్, చికెన్‌లో వెరైటీలైన తిరంగా చికెన్, చికెన్ పాప్‌కార్న్, చికెన్ వెజ్ స్టిక్ రోల్స్, చికెన్ స్టిక్స్, చికెన్ కబాబ్ వంటి మాంసాహార వంటలతోపాటు..



శాఖాహారమైన పండ్లతో తయారు చేసే షహదూద్ మలై, మ్యాంగో మలై, సీతాఫల్ మలై, జామున్ మలై, లిచి మలై, ముంజల్ మలై, కద్దుకా రిస్తా, క్రీమ్ ఫ్రూట్ సలాడ్, ఖుబానీకా మీఠా, రబ్డీ, డబుల్‌కా మీఠా ఈ హోటళ్లలో ప్రత్యేకం. వీటిని ఆరగించేందుకు ఆహార ప్రియులు ఈ హోటళ్లకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు.

ఫ్యామిలీలతో వచ్చిపోయేలా..!

సాయంత్రం ఆరు గంటలకు ముస్లింలు ఉపవాస దీక్ష విరమించిన తర్వాత హలీం, హరీష్‌లతో పాటు తమకు ఇష్టమైన డ్రైఫ్రూట్స్, ఫ్రూట్స్ తీసుకుంటారు. గతంలో హలీం, హరీష్ తీసుకుని ఇళ్లకు వెళ్లి ఆరగించేవారు. ప్రస్తుతం ఈ వంటకాలను ఫ్యామిలీలతో కలిసి వచ్చి కూర్చుని తినేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ అన్ని మతాల వారు కుటుంబ సమేతంగా వచ్చి ఈ రుచులను ఆస్వాదిస్తున్నారు.

స్పందన బాగుంది



ఐదు సంవత్సరాలుగా ప్రతి రంజాన్ మాసంలో నెల రోజుల పాటు హోటల్ నడుపుతున్నాం. నల్లగొండలోని హైదరాబాద్ తరహాలో చికెన్ హరీస్, మటన్ హలీమ్‌లతో పాటు వివిధ రకాల చికెన్ ఐటమ్స్, అనేక రకాల స్వీట్లు తయారు చేస్తాం. ఆహార ప్రియుల నుంచి స్పందన బాగుంది. ఈ సంవత్సరం హోటల్‌ను రంజాన్ తరువాత కూడా కొనసాగించాలని అనుకుంటున్నాం.

– ఎండీ.షఫీఖ్, హైదరాబాద్ క్యాటరర్స్, నిర్వాహకుడు, నల్లగొండ

మొదటిసారి పరిచయం చేస్తున్నాం



రంజాన్ మాసంలోనే హలీం, హరీస్ దొరుకుతాయి. అయితే హైదరాబాద్, ఇతర నగరాల్లో చాలా రకాల రంజాన్ వంటకాలు ఉంటాయి. సూర్యాపేట వాసులకు ఈసారి కొత్త రుచులను పరిచయం చేయాలని నిర్ణయించాం. అందులో భాగంగా నల్లగొండ కేంద్రంగా పనిచేస్తున్న హైదరాబాద్ క్యాటరర్స్‌తో కలిసి ఇక్కడ సెంటర్ ఏర్పాటు చేశాం. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

– తఖీ మహమ్మద్, సూర్యాపేట



రంజాన్ వంటకాలను ఆరగిస్తున్న ప్రజలు

చిన్న పట్టణాల్లోనూ హరీస్ సెంటర్లు



ప్రధాన పట్టణాల్లో ఒకటి, రెండు చోట్లకే పరిమితమైన హరీస్, హలీమ్ సెంటర్లు ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని చిన్న పట్టణాల్లో సైతం ఏర్పాటయ్యాయి. మొన్నటి వరకు నల్లగొండ, సూర్యాపేటలో హలీమ్, హరీస్, ఖీర్, డబుల్ కామీఠా మాత్రమే దొరికేవి. ఇప్పుడు హైదరాబాద్ వెరైటీలు దొరుకుతున్నాయి. భువనగిరి ప్రాంతంలో హరీస్, హలీమ్ అందుబాటులో ఉంటున్నాయి. ఇక్కడి వారు వెరైటీ రుచులను మాత్రం రాజధానికి వెళ్లి ఆస్వాదిస్తుంటారు.

రెండో విడతకు ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- గొర్రెల పంపిణీపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సాక్షి, యాదాద్రి : రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం అధికారులతో సమావేశమైన గొర్రెల కొనుగోలు, పంపిణీకోసం చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రతి మండల బృందంలో మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, వెటర్నరీ అసిస్టెంట్ ఉంటారని పేర్కొన్నారు. రెండవ విడతకు సంబంధించి జిల్లాలో 15,390 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు చెప్పారు. వీరిలో 1,509 మంది తమ వాటా ధనం చెల్లించారని, మిగతా వారు కూడా చెల్లించేలా క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు తమ వాటా ధనం, గొర్రెల సంరక్షణ, ఇన్సూరెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు వచ్చే సోమవారం నుంచి రైతువేదికల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

లబ్ధిదారుల నుంచి కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డ్ జిరాక్స్ కాపీలతో పాటు నామినీ ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లను దరఖాస్తుతో పాటు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

గొర్రెలు కొనుగోలు చేసే ప్రాంతాలు ఇవీ..

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కృష్ణా జిల్లాలు, కర్ణాటకలోని బెల్గాం, మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతాల్లో గొర్రెలను కొనుగోలు చేస్తామన్నారు. మండల ప్రత్యాధికారులు తమ వెంట కొనుగోలుదారుని తీసుకుని వెళ్తారని తెలిపారు. లబ్ధిదారునికి గొర్రెల యూనిట్‌లు పంపిణీ చేసే సమయంలో 100 కిలోల దాణా, రూ.500 విలువ గల మందులు ఇస్తామన్నారు. ఉపాధిహామీ పథకంలో గొర్రెల షెడ్డు ఏర్పాటు చేసుకోవడానికి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గొర్రెల రవాణాకు సంబంధించిన సీల్ టెండర్లను ఈనెల 18వ తేదీన ఓపెన్ చేసి ట్రాన్స్‌పోర్టువారిని ఎంపిక చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కృష్ణ, సహాయ సంచాలకులు డాక్టర్ ఐలయ్య పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలి

సాక్షి, యాదాద్రి : మున్సిపాలిటీల్లోని వాణిజ్య సముదాయాలు తమ ట్రేడ్ లైసెన్సులను ఈనెల 30వ తేదీలోగా రెన్యూవల్ చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో 2022–23 సంవత్సరానికి సంబంధించి 2,171 ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయగా రూ.2.33 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. భువనగిరి మున్సిపాలిటీలో 1101 వాణిజ్య సముదాయాలకు రూ.1.10కోట్లు, చౌటుప్పల్ 373 వాణిజ్య సముదాయాలకు గాను రూ.1.5 కోట్ల ఆదాయం రాబట్టి రాష్ట్రంలో ముందు నిలిచినట్లు వెల్లడించారు. ఆలేరులో 115 దుకాణాలకు రూ.3.28లక్షలు, మోత్కూరులో 181 దుకాణాలకు రూ.4.22లక్షలు, భూదాన్‌పోచంపల్లి 94 వాణిజ్య సముదాయాలకు రూ.6.7లక్షలు, యాదగిరిగుట్ట 307 వాణిజ్య సముదాయాలకు రూ.3.59లక్షలు వచ్చినట్లు వెల్లడించారు. పెనాల్టీ లేకుండా గడువులోపు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు.

టెంపుల్ కారిడార్ రోడ్డు వేయాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ జిల్లా నాయకుల వినతి



కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, నాయకులు

సాక్షి,యాదాద్రి : కీసర రామలింగేశ్వర స్వామి ఆలయం, యాదాద్రి, కొమురవెల్లి, కొలనుపాక జైన మందిరం, పెంబర్తిని కలుపుతూ టెంపుల్ కారిడార్ రోడ్డు ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. టెంపుల్ కారిడార్ కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ.300 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందే కానీ, అమలు చేయలేదన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కీసర జంక్షన్ నుంచి యాదగిరిగుట్ట, కొలనుపాక మీదుగా పెంబర్తి వరకు అనుసంధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ రహదారి వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతోపాటు, ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు ప్రత్యామ్నాయ రహదారిగా మారుతుందన్నారు. తుర్కపల్లి బయోటెక్ పార్క్, కరకపట్ల బయోటెక్ పార్క్ సందర్శకులకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆలేరు, జనగాం, మేడ్చల్ నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని మంత్రికి తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ నాయకులు కొలను చంద్రశేఖర్‌రెడ్డి, పడాల శ్రీనివాస్, సుధగాని హరిశంకర్‌గౌడ్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, తిరుమల కృష్ణ, శత్రునాయక్ తదితరులు ఉన్నారు.

ఫైలేరియాను పారదోలుదాం

- వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే
- ఎంపిక చేసిన 12 గ్రామాల్లో పూర్తి
- రక్త నమూనాల సేకరణ.. హైదరాబాద్ ల్యాబ్‌కు శాంపిల్స్



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

భువనగిరి : ఫైలేరియా రహిత జిల్లాగా మార్చేందుకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. ఇందు కోసం ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టిన సర్వే శనివారం ముగిసింది. ఇప్పటికే జిల్లాలో 2,010 మంది ఫైలేరియా బాధితులను ఉన్నారు. వీరి నుంచి ఇతరులకు విస్తరించకుండా ఉండేందుకు సర్వే చేపట్టి రక్తనమూనాలు సేకరించి నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్ పంపారు.

12 గ్రామాలు ఎంపిక

రాష్ట్ర ఫైలేరియా, మలేరియా అడిషనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నేషనల్ సెంటర్ సెంట్రల్ ఫర్ సెక్టార్ బార్న్ డీజ్ కంట్రోల్ పథకం ద్వారా ఫైలలేరియా లక్షణాలున్న వారిని గుర్తించేందుకు 12 గ్రామాలను ఎంపిక చేశారు. ఇందులో 6 సాధారణ గ్రామాలు, 6 ఫైలేరియా బాధితులున్న గ్రామాలున్నాయి. ఈనెల 12న సింగారం(రాజాపేట మండలం), వాసాలమర్రి (తుర్కపల్లి), అనాజిపురం(భువనగిరి), ఇస్కిల్ల (రామన్నపేట), కోటమర్తి (అడ్డగూడూరు), తంగడపల్లి(చౌటుప్పల్) గ్రామాల్లో రాత్రి సమయంలో సర్వే చేసి ఒక్కో గ్రామంలో 300 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ నెల 15న ఎంపిక చేసిన సాధారణ గ్రామాలైన కొండమడుగు(బీబీనగర్), జలాల్‌పూర్(భూదాన్‌పోచంపల్లి), పల్లెర్ల(ఆత్మకూర్.ఎం), వర్కట్‌పల్లి(వలిగొండ), భువనగిరి, ఆలేరు మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డులో రాత్రి సర్వే చేసి రక్త నమూనాలను సేకరించారు.

36 బృందాలతో సర్వే

36 బృందాల ద్వారా సర్వే పూర్తి చేశారు. ఒక్కో బృందంలో ఇద్దరు నుంచి ముగ్గురు వైద్యారోగ్య సిబ్బంది ఉన్నారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్‌తో పాటు ఆశ కార్యకర్త లేదా ఏఎన్ఎం ఉన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిలో మైక్రో ఫైలేరియా పగటి సమయంలో లీవర్‌లో ఉంటుంది. రాత్రి సమయంలో రక్తంలో సంచరిస్తుంది. కాబట్టి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చనే ఉద్దేశంలో రాత్రి సమయంలో సర్వే చేపట్టారు.

నమూనాలను ల్యాబ్‌కు పంపాం



జిల్లాను ఫైలేరియా రహితంగా మార్చేందుకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో సర్వే పూర్తి చేశాం. రక్త నమూనాలు సేకరించాం. సేకరించిన రక్త నమూనాలను టెస్టుల కోసం హైదరాబాద్‌కు పంపాం. ఫలితాలు వచ్చిన తర్వాత వ్యాధి నివారణకు చర్యలు చేపడుతాం.

–డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీఎంహెచ్ఓ

అండర్‌పాస్‌కు మోక్షం



జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మించాల్సిన మోటకొండూరు - వంగపల్లి జంక్షన్

హైదరాబాద్ - వరంగల్ హైవేపై వంగపల్లి క్రాసింగ్ వద్ద నిర్మాణం

- రూ.15 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న మోటకొండూరు, యాదగిరిగుట్ట మండలాల ప్రజలు

యాదగిరిగుట్ట రూరల్ : హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై యాదగిరిగుట్ట మండల పరిధిలోని వంగపల్లి – మోటకొండూరు జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి మోక్షం లభించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేసింది. దీంతో పాటుగా సర్వీస్ రోడ్డు కూడా వేయనున్నారు. మే నెలాఖరు వరకు టెండర్లు పూర్తికానున్నాయి. ఏడాదిలోపు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

తీరనున్న ఇబ్బందులు

యాదగిరిగుట్ట, మోటకొండూరు మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు తమ పనుల నిమిత్తం యాదగిరిగుట్ట, భువనగిరి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా చొల్లేరు, మహబూబ్‌పేట, మర్రిగూడెం గ్రామాల ప్రజలు తమ వ్యవసాయ భూముల వద్దకు జంక్షన్ దాటి వెళ్లాల్సి ఉంటుంది. అయితే అండర్‌పాస్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు నేరుగా జాతీయ రహదారిపైకి వస్తున్నారు. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ జంక్షన్ వద్ద గడిచిన నాలుగేళ్లలో 205 ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు మృతి చెందారు. మరికొందరు క్షతగాత్రులయ్యాయి.

ఫలించిన పోరాటం

వంగపల్లి – మోటకొండూరు జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మించాలని మోటకొండూర్, చొల్లేరు, మహబూబ్‌పేట, మర్రిగూడెం, వంగపల్లి గ్రామాల ప్రజలు నాలుగేళ్లలో అనేకసార్లు పోరాటాలు సాగించారు. జాతీయ రహదారిపై ధర్నా చేశారు. రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి అండర్‌పాస్ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య ఆధ్వర్యంలో పాదయాత్రలు చేశారు. అదే విధంగా ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ కోమటిరెడ్డిలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఇబ్బందులు తొలగిపోతాయి



వంగపల్లి – మోటకొండూరు జంక్షన్ వద్ద అండర్‌పాస్‌కు కేంద్రం నిధులు మంజూరు చేయడం చాలా సంతోషం. అండర్‌పాస్ నిర్మాణం పూర్తయితే చుట్టుపక్కల గ్రామాలతో పాటు మోటకొండూర్ నుండి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగిపోతాయి. అండర్‌పాస్ నిర్మాణానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకు ధన్యవాదాలు.

–తోటకూరి బీరయ్య, సర్పంచ్, చొల్లేరు

రోడ్డు దాటలేకపోతున్నాం



జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. వాహనాలు వేగంగా వస్తుంటాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే దాటాలంటే చాలా భయంగా ఉంటుంది. అండర్‌పాస్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది.

–మచ్చ విఘ్నేశ్వర్, ప్రయాణికుడు, మహబూబ్‌పేట

సంతోషంగా ఉంది



వంగపల్లి – మోటకొండూర్ జంక్షన్ వద్ద అండర్‌పాస్ మంజూరవడం సంతోషంగా ఉంది. వివిధ పనుల నిమిత్తం రోడ్డు అవతలికి వెళ్లాల్సి ఉంటుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నాం. అండర్‌పాస్ పూర్తయితే అవస్థలు తొలగిపోతాయి.

–వల్లపు శేఖర్, ప్రయాణికుడు, వంగపల్లి

పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు

భువనగిరి : ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, ఎయిమ్స్, భువనగిరి న్యాయవాదుల సంఘం, రోటరీక్లబ్, భువనగిరి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సంయుక్తంగా భువనగిరి కోర్టు ఆవరణంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు, వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ఒత్తిడిలో ఉంటూ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దన్నారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్ప, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అంజయ్య, రోటరీక్లబ్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

‘రీజినల్ రింగ్ రోడ్డుకు భూములిచ్చేదే లేదు’

భువనగిరి : రీజనల్ రింగ్ రోడ్డును రద్దు చేయాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య భవనంలో రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల సమస్యపై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే రాయగిరి రైతులు జాతీయ రహదారి, కాళేశ్వరం ప్రాజెక్టు, హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటులో భూములు కోల్పోయరని, ఉన్నకాస్త భూమి పోతే మేం ఎట్ల జీవించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో భూములివ్వబోమని తేల్చి చెప్పారు. సదస్సులో రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల సంఘం నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, అవుశెట్టి పాండు, గడ్డమీది మల్లేశం, అనిల్‌తో పాటు రాయగిరి, గౌస్‌నగర్, పెంచికల్‌పహాడ్, గోకారం, వర్కట్‌పల్లి తదితర గ్రామాల భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

దేవరకొండ: అనుమతులు లేకుండా తరలిస్తున్న 17క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణం నుంచి నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తికి అశోక్ లేలాండ్ వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి వద్ద వాహనాన్ని తనిఖీ చేసి పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సాగర్‌లో తొమ్మిది క్వింటాళ్లు..

నాగార్జునసాగర్: పలనాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన ఐదుగురు వ్యక్తులు నక్కబోయిన శ్రీనివాసరావు, ఓర్సుకోటేశ్వర్‌రావు, పిట్టల రవిశంకర్, బత్తుల కోటేశ్వర్‌రావు, బత్తులనాగరాజు చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని సేకరించారు. ఆ బియ్యాన్ని ఆంధ్రా–తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో గల కొత్తబ్రిడ్జి మీదనుంచి తరలిస్తున్నారు. బ్రిడ్జివద్ద వాహనాలను చెక్ చేస్తుండగా బొలేరోలో తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు నాగార్జునసాగర్ ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో నాగన్న మృతదేహం

వలిగొండ : ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజా మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన నాగన్న (48) కుటుంబంతో సహా కొంతకాలం క్రితం వలిగొండ మండలానికి వచ్చి గోల్నేపల్లి, నెమిలెకాల్వ స్టేజి సమీపంలో గల ఇటుకబట్టీలలో పనిచేస్తున్నాడు. కాగా, నాగన్న శనివారం రాత్రి ఇటుకబట్టీ నుంచి గొల్నేపల్లి గ్రామంలోకి నడుచుకుంటూ వెళ్తుండగా స్టేజి సమీపంలో వెనుకనుంచి వచ్చిన ఓ బైక్ ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో నాగన్న కిందపడగా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

నిలిచున్న కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

- ఒకరి దుర్మరణం, పలువురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- మృతుడు, క్షతగాత్రులు బిహార్ వాసులు



గుల్జార్ (ఫైల్)

హుజూర్‌నగర్ : మద్యం మత్తు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకోగా పలువురిని క్షతగాత్రులను చేసింది. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. హుజూర్‌గర్‌లో శనివారం ఉదయం రోడ్డు పక్కన నిలిచున్న కూలీల ట్రాలీ ఆటోను అతివేగంతో వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యవసాయ కూలీలు ఇటీవల హుజూర్‌నగర్‌కు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



ప్రమాదానికి గురైన టాటాఏస్ వాహనం

కూలికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా..

డ్రైవర్‌తో సహా 16మంది బిహార్ కూలీలు ఉదయం కూలి పనులకు వెళ్లేందుకు పట్టణంలోని లింగగిరి రోడ్డులో టాటాఏస్ వాహనంలో ఎక్కారు. అందరూ వచ్చినట్టేనా అని సరి చూసుకుంటున్న క్రమంలో అదే మార్గంలో వెళ్తున్న లారీ కూలీల ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో ఆ పక్కనే ఉన్న ప్రహరీకి బలంగా ఢీకొనడంతో కొద్దిమేర కూలిపోయింది. ప్రమాదంలో కూలీలందరికీ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంలో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ గుల్జార్ (35) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, అదే రాష్ట్రానికి సాజిద్, ఫిర్యాద్ ఖాన్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన యారిసింగ్, రాజ్ కుమార్, దుబ్లూ కుమార్, ఎండీ సోనూ, సర్‌సుద్దీన్, రోహిత్ కుమార్, జ్యోతిష్ మండల్, మహ్మద్ తన్వీర్, సర్వాజ్, చందన్ మండల్, షానువాజ్ హుస్సేన్, ఎండీ బాబ్లీ, రాజుబస్మాలు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరుణ్‌కుమార్ పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో స్థానికులు చితకబాదగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్షతగాత్రులకు పరామర్శ

పట్టణంలోని లింగగిరిరోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రిలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

స్నేహితుల విహారం.. విషాదాంతం

- సాగర్ వెనుక జలాల్లో మునిగి యువకుడు మృతి



భరత్ చారి (ఫైల్)

దేవరకొండ(చందంపేట) / త్రిపురారం : ముగ్గురు మిత్రుల విహార యాత్ర చివరకు విషాదాంతమైంది. సాగర్ వెనుక జలాల్లో మునిగి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నేరెడుగొమ్ము మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. త్రిపురారం మండలానికి చెందిన సాదోజు భరత్‌చారి(23) హైదరాబాద్‌లో నివాసముంటూ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భరత్‌చారి హైదరాబాద్‌కు చెందిన మరో ముగ్గురు స్నేహితులు సాగర్‌రెడ్డి, భుజేందర్‌గౌడ్, భరత్‌రెడ్డితో కలిసి కారులో శనివారం నేరెడుగొమ్ము మండల పరిధిలోని వైజాక్ కాలనీకి వచ్చారు. భరత్‌చారి స్నేహితుల్లో ఇద్దరు సాగర్‌రెడ్డి, భరత్‌రెడ్డి టిఫిన్ కోసమని గ్రామంలోకి వెళ్లారు. కాగా, భరత్‌చారి, భుజేందర్‌గౌడ్ సరదాగా ఈత కొట్టేందుకు నీటిలో దిగారు. ఈ క్రమంలో నీటిలో గల బావిగుంతను గమనించని భరత్‌చారి నీట మునిగాడు. గమనించిన స్నేహితులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా, భరత్‌చారిని నీటినుంచి వెలికితీయగా అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

నాడు తండ్రి.. నేడు కుమారుడు

త్రిపురారం మండల కేంద్రానికి చెందిన సాదోజు లక్ష్మణాచారి, జ్యోతి దంపతులకు కుమారుడు భరత్‌చారి, కూతురు సంతానం. వీరిది పేద కుటుంబం. అయితే, లక్ష్మణాచారి అనారోగ్య కారణాలతో ఐదేళ్ల క్రితం మరణించాడు. దీంతో జ్యోతి త్రిపురారంలో పుట్టింటి వద్ద ఉంటూ కారం మిల్లు నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంటికి ఆసరాగా ఉన్న కుమారుడు అనుకోని ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. 'నాడు భర్తను తీసుకెళ్లావు.. నేడు చేతికొచ్చిన కుమారుడిని బలిగొన్నావు.. మాకు దిక్కెవరు దేవుడా' అంటూ తల్లి జ్యోతి గుండెలవిసేలా రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. భరత్ మృతితో త్రిపురారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సిమెంట్ దిమ్మెను ఢీకొని యువకుడు దుర్మరణం



ఉమేశ్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : బైక్‌పై వస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై ఉన్న మిషన్ భగీరథ దిమ్మెను ఢీకొని దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన తప్పెట నర్సింహ కుమారుడు తప్పెట ఉమేశ్(24) ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం వ్యక్తిగత పనిమీద బీబీనగర్ మండలం భట్టుగూడేనికి బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో పెద్దగూడెం–భట్టుగూడెం గ్రామాల మధ్య ఉన్న మూసీ బ్రిడ్జిపై బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న మిషన్‌భగీరథ పైప్‌లైన్ సిమెంట్ దిమ్మెపై పడటంతో తల పగిలి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన మోటె నర్సింహ గమనించి విషయం గ్రామస్తులకు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంబులెన్స్‌లో భువనగిరి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఉమేశ్ మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబంలో పెను విషాదం అలుముకుంది.

న్యాయం చేయాలని ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా



కొంపల్లిలో ధర్నా చేస్తున్న బాధితురాలు దీపిక

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి గర్భవతిని చేసి పాప జన్మకు కారణమై నేడు వేరే పెళ్లి చేసుకుంటున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ యువతి శనివారం ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. మండలంలోని కొంపల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటనపై బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన లింగాల సాయి కుమార్ అదే గ్రామానికి చెందిన సమీప బంధువు కూతురు వడ్డమాల దీపికను ప్రేమించాడు. పెళ్లిచేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. దీంతో ఏడు నెలల క్రితం ఆమె ఒక పాపకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి పెళ్లి చేసుకోమని కోరగా దీపిక దాల్చిన గర్భానికి తనకు సంబంధం లేదని అనడంతో ఆమె కుటుంబ సభ్యులు రెండేళ్ల క్రితం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేయడంతో ప్రస్తుతం ఆ కేసు కోర్టు పరిధిలో ఉంది. ఈ క్రమంలో సాయికి వేములపల్లి మండలానికి చెందిన ఓ యువతితో పెళ్లి కుదిరిందనే సమాచారంతో బాధితురాలు దీపిక శనివారం జిల్లా మహిళా సంఘం ఆధ్యక్షురాలు కారంపుడి ధనలక్ష్మి, ఐద్వా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు కాశిమళ్ల గీతతో కలిసి సాయి కుమార్ ఇంటి ఎదుట ధర్నాకు దిగింది దీంతో ఆగ్రహించిన సాయి కుమార్ కుటుంబ సభ్యులు బాధితురాలు దీపిక, మహిళా సంఘం నాయకులపై దాడి చేసినట్లు మహిళా సంఘం అధ్యక్షురాలు ధనలక్ష్మి తెలిపారు.

మునగాల ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు

మునగాల(కోదాద): అకారణంగా తనపై దాడి చేసిన మునగాల పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ లోకేష్‌పై చర్యల తీసుకోవాలని కోరుతూ మండలంలోని కొక్కిరేణి ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డి శనివారం ఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.14వ తేదీ రాత్రి మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా జరుగుతున్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రొటోకాల్ ప్రకారం తనను స్టేజీమీదకు ఎందుకు పిలవలేదు అని అక్కడ ఉన్న కళాకారులను అడుగుతుండగా ఎస్‌ఐ దాడి చేశారని వినతిపత్రంలో పేర్కొన్నాడు.

ఎంపీటీసీపై కేసు

మండలంలోని తిమ్మారెడ్డిగూడేనికి చెందిన కొక్కిరేణి ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డిపై శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ పి.లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా పనులలో నిమగ్నమైన ఎస్సీ కమ్యూనిటీకి చెందిన జైభీమ్ ఆర్గనైజేషన్ వారిని ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి కుల వివక్షతో దూషించాడని తెలిపారు. ఎంపీటీసీ తమను దుర్భాషలాడారని జైభీమ్ ఆర్గనైజేషన్ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక జల్లెడలో ఇరుక్కొని ఒకరి మృతి



శివకుమార్ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన జల్లెడ

నాగారం : ప్రమాదవశాత్తు ఇసుక జల్లెడలో ఇరుక్కొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగారం మండల కేంద్రానికి చెందిన బొబ్బలి శివకుమార్ (30) నూతన ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ మోటార్‌తో నడిచే జల్లెడను తీసుకొచ్చి ఇసుకను పడుతున్నాడు. జల్లెడలో ఇసుక పోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు శివకుమార్ మెడ భాగం జల్లెడలో ఇరుక్కొని అక్కడికక్కడే మృతిచెందాడు. కళ్లేదుంటే ఇంటి పెద్ద మరణించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివకుమార్ మృతితో నాగారంలో విషాదం అలుముకుంది.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు, ఆయిల్ చోరీ



వరిచేనులో పడేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఖాళీడబ్బా

భూదాన్‌పోచంపల్లి : దుండగులు వ్యవసాయబావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని గౌస్‌కొండ శివారులో శనివారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు రేవనపల్లి గ్రామానికి చెందిన సుర్కంటి బాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌస్‌కొండ గ్రామశివారులో గల నేల్లబావి వద్ద రైతులు గుర్రం రాంరెడ్డి, ముత్యాలు, కిష్టయ్య, గుల్లం బాల్‌నర్సింహ కలసి లక్ష రూపాయలు ఖర్చు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కాగా,దుండగులు శుక్రవారం అర్ధరాత్రి కరెంట్ బంద్ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను విప్పి అందులో ఉన్న కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేశారు. ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్ డబ్బాను వరిచేనులో పడేసిపోయారు. శనివారం ఉదయం రైతులు బావి వద్దకు వెళ్లిచూడగా ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్ వరిచేనులో పడి ఉంది. వెంటనే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్‌ఐ బాద్యానాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తికి రూ.లక్షా 70వేల జరిమానా

చివ్వెంల : గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా హరితహారం మొక్కలు నరికిన వ్యక్తికి అధికారులు రూ.1.70లక్షల జరిమానా విధించారు. మండల పరిధిలోని ఎర్ర సూర్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సారెస్పీ కాలువ పక్కన నాటిన హరితహర చెట్లను క్రషర్ యాజమాని భుక్యా బాలు కొద్దిరోజుల క్రితం నరికివేశాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి అతడికి గత నెల 31న రూ. 6.60 లక్షలు జరిమానా విధించారు. కాగా గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు చెట్ల విలువ రూ. 1.70లక్షలు మాత్రమే ఉంటుందని అధికారులకు వివరించడంతో శనివారం అతడికి అంతే మొత్తంలో జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీఓ టి.గోపి, పంచాయతీ కార్యదర్శి అరవిందు నారాయణ, సర్పంచ్ ధరావతు రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



జరిమానా చెల్లించి రసీదు తీసుకుంటున్న బాలునాయక్

యువకుడి ఆత్మహత్యకు పోలీసులే కారణమని..

- తాస్కానిగూడెం గ్రామస్తుల ఆందోళన
- రెండు గంటలకు పైగా పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట
- షీటీం, సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్
- న్యాయం చేయాలని మైనర్ ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

చండూరు : ప్రేమ వ్యవహారంలో సరైన విచారణ జరపకుండా పోలీసులు చితకబాదడంతో చండూరు మండలం తాస్కానిగూడేని చెందిన అబ్బనబోయిన శివ (26) ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. అందుకు కారకులైన షీటీం, సీఐని సస్పెండ్ చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనకు దిగారు. తాస్కానిగూడేనికి చెందిన అబ్బనబోయిన శివ డిగ్రీ వరకు చదువుకుని పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సన్నద్ధమవుతున్నాడు. శివ ఇదే గ్రామానికి చెందిన ఓ మైనర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం బాలిక కుటుంబ సభ్యులకు తెలియడంతో ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేయగా షీటీం శివను అదుపులోకి తీసుకుంది. కౌన్సిలింగ్ అనంతరం శివను విడిచిపెట్టగా 11న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

మృతదేహాన్ని తీసుకొస్తున్నారని..

శివ మృతదేహాన్ని పోలీసులు స్వగ్రామానికి తీసుకొస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆందోళనకు సిద్ధమయ్యారు. గ్రామ శివారులో అంబులెన్స్‌ను అడ్డుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పోలీసులు, గ్రామస్తులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. షీటీంను సీఐని సస్పెండ్ చేయాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అంబులెన్స్ డోర్లను బలవంతంగా తెరిచి శివ మృతదేహాన్ని తీసుకుని బాలిక ఇంటి ముందు వేసి ధర్నాకు దిగారు. అయితే, గ్రామస్తుల ఆగ్రహావేశాలు చూసి పోలీసులు ఒకింత సంయమనం పాటిస్తూ వారి ఆందోళనకు అనుమతించారు. అర్ధరాత్రి వరకు కూడా ఆందోళన కొనసాగుతూనే ఉంది.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చిత్తలూరు గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోడ సైదులు(34) కొన్నేళ్లుగా విద్యుత్ మోటార్ల మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని సాకుతున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన గిరగాని సోమయ్య మోటారును మరమ్మతు చేసేందుకు అతడి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. మోటార్‌ను పరీక్షించే సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ఫ్యూజ్‌పోయి ఉంది. రైతు విద్యుత్ సిబ్బందికి విషయాన్ని చెప్పేందుకు పలుమార్లు ఫోన్‌చేసినా స్పందించలేదు. దీంతో రైతు సోమయ్య కోరిక మేరకు సైదులు ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేసే క్రమంలో విద్యుత్‌తీగ తెగి అతడిపై పడటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు గమనించి అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ Plot for Sale 250 Sq.yds, Behind MRF Tyres, Hyd Road, Padma Nagar, Call: 8309667358 [WB-1155]

HOUSE FOR SALE

■ నల్గొండ పట్టణం MLG రోడ్డు అల్కాపురి కాలనీలో సౌత్ ఫేస్ న్యూ కన్‌స్ట్రక్షన్ అన్ని వసతులు గల ఇల్లు అమ్మబడును. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. ఫోన్: 7396781479, 9440184054 [H-781556]

LEASE OR RENT

■ Lease/Rent for Hotel and Lodging purpose, SFT 1740 Each Floor at Gundlapally. Opp: Sannidhi Emerald Hotel, Yadagiri Gutta. Please Cont: 9133931117 [Y-784256]

FOR SALE

■ JB INFRA PROJECT Regarding OPEN PLOTS & VILLAS, HMDA & DTCP High way Facing IBRAHIMPATNAM, CHOUTUPPAL & MALL. Price 8,500/- to 25,000/- for Sq. Yard Contact: 94914 87423 [YA-3120]

FLAT FOR SALE

■ LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి, ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే ఫోన్ : 9848525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-29333]

Services

■ అతి తక్కువ డాక్యుమెంట్స్‌తో రుణాలు ఇవ్వబడును. వ్యక్తిగత, ప్రాపర్టీ, వ్యాపారం, వ్యవసాయం, మార్క్‌షీట్ రుణాలు ఇవ్వబడును. సంప్రదించండి: 7731886547. [T-20]

జ్యోతిష్యాలయం

■ కేరళ మాంత్రిక సాయి స్వరూప జోతిష్య వ: వి. అయ్యప్పన్ (స్త్రీ/పు) వశీకరణం, సంతాన, ఉద్యోగ, ప్రేమ వివాహం, సతి-పతి కలహం, ప్రేమలో మోసపోవడం ఏలాంటి గుప్త కష్టకర నిఘాడ సమస్యలకు శాశ్వత పరిష్కారం. సంప్ర:: 9573677754 [Y-784258]

Wanted

■ కీర్తి క్రియేషన్స్ రెడిమెడ్ బట్టల షాపులోకి అనుభవం గల సేల్స్‌మెన్స్ & గర్ల్స్ లోకల్ వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ప్రకాశం బజార్, నల్లగొండ. నగేష్ – 9247272429 [Y-1146113]

■ Colleges లో Admissions చేయించుటకు నల్లగొండ పట్టణంలో లేడి టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును. సంప్ర:: 8686958844, 9032958845 [Y-784334]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటి వద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000–20,000 వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర:: 9000408325 [G-785745]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785739]

■ Wanted Maths, Physics, Chemistry, English Faculty and Male & Female wardens for Junior College in Nalgonda Town. Cont : 8639327414, 9440926959 [YA-14741]

■ TATA SKY, DTH & VODAFONE IDEA నల్లగొండ మరియు మిర్యాలగూడలో పనిచేయుటకు సేల్స్ ప్రమోటర్స్ & టెలికాలర్స్ కావలెను. సంప్ర:: 9676929505 [Y-784336]

■ నల్లగొండ పట్టణం ప్రొఫెషనల్ కొరియర్ నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ మరియు డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర:: 9390950573 [Y-784337]

■ శ్రీ లక్ష్మీ హోంకేర్: HYDలో వృద్ధులకు పేషంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి /వంటపని స్త్రీ/పు కావలెను. జీతం: 16-18వేలు, రూం+ మీల్స్ ఫ్రీ. 9347148051 [G-550]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ © 9030044646. [B-1165937]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640528899. [H-793415]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సమ్మె బాటలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- 15రోజుల్లోగా రెగ్యులరైజేషన్ జీఓ విడుదల చేయాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకుంటే 28నుంచి సమ్మెలోకి వెళ్తామని అల్టిమేటం
- ఇప్పటికే జిల్లా, మండల స్థాయి అధికారులకు వినతులు



అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు (ఫైల్)

నల్లగొండ, మిర్యాలగూడ: గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లు తమ డిమాండ్ల సాధనకు సమ్మెకు సిద్ధమవుతున్నారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని తప్పకుండా రెగ్యులరైజ్ చేస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ నెల 12వ తేదీతో నాలుగేళ్లు పూర్తయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ జిల్లా, మండల అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు.


నాలుగేళ్లు పూర్తయినా..

ప్రభుత్వం 2018 ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా 9,355 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అదే ఏడాది అక్టోబర్‌లో రాత పరీక్ష నిర్వహించి 2019 ఏప్రిల్ 12 ఉద్యోగ విధుల్లోకి తీసుకున్నారు. అన్ని ఉద్యోగాలకు ప్రొబేషనరీ కాలం రెండేళ్లు ఉండగా వీరికి మాత్రం మూడేళ్ల కాలపరిమితి విధించి అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే ఆ ప్రొబేషనరీ కాలం 2022లో పూర్తయినప్పటికీ వారిని క్రమబద్ధీకరించకుండా మరో ఏడాది ప్రొబేషనరీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు, జీతాన్ని రూ.15వేల నుంచి రూ.28,719 పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. ప్రస్తుతం నాలుగేళ్లు పూర్తయినా రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి జీఓ విడుదల కాకపోవడంతో ఈనెల 28 నుంచి సమ్మె బాట పడతామని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ సభ్యులు అల్టిమేటం జారీ చేశారు.

భవిష్యత్ కార్యాచరణపై చర్చ

తమ డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కమిటీ ముఖ్య నాయకులు శనివారం నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. 15 రోజుల్లోగా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకపోతే సమ్మెకు వెళ్తామని ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకొని రెగ్యులర్ జేపీఎస్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగోని సతీష్‌తోపాటు పలు మండలాలకు చెందిన సంఘం బాధ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయినందున ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెబాట పడతాం.

– పూనపాటి నరేష్, జేపీఎస్‌ల సంఘం అధ్యక్షుడు, దామరచర్ల మండలం

గ్రామాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నాం



గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. పనిభారం, ఒత్తిళ్లు ఉన్నప్పటికీ కష్టపడి పనిచేస్తున్నాం. ఇకనైనా ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి.

– బారపాటి నాగరాజు, జేపీఎస్, నూనావత్‌తండా

అవార్డులు రావడంలో ప్రముఖపాత్ర



గ్రామాలకు జాతీయ స్థాయిలో అవార్డులు రావడంలో జేపీఎస్ పాత్ర ముఖ్యమైంది. శానిటేషన్, హరితహారం, నర్సరీల నిర్వహణ వంటి అనేక పనులు చేపడుతూ అభివృద్ధికి పాటుపడుతున్నాం. ప్రభుత్వం రెగ్యులరైజేషన్ జీఓ విడుదల చేయాలి.

– జె.కృష్ణ, జేపీఎస్, బందావత్‌తండా